

పాపం. నువ్వు ఆయనకు చెప్పులివ్వాలి. ఊరికే ఇస్తే తీసుకోడు. ప్రతిరోజూ ఆయన గంగనుంచి పైకి లేచే సమయంలోపల అక్కడక్కడా కొన్ని చెప్పుల జతలుంచు. ఆయన నీ చెప్పులేసుకుంటే నీ పంట పండినట్లే! ఆ పుణ్యం వల్ల పదినెలలు తిరిగే లోపుగా నీకు తప్పక పుత్రసంతానం కలుగుతుంది'' అని బోధించింది.

మాతంగుడు శ్రద్ధగా ఆమె మాటలు ఆలకించాడు. అగ్నిశిఖుడు గంగనుంచి పైకిలేచి, ఆశ్రమానికి వెళ్లేవరకు వేచి చూశాడు. దూరంగానే ఉండి ఆయన పాదాలకు నమస్కరించాడు. తన దుకాణానికి పరుగు పరుగున వెళ్లి, ఆయనకు సరిపడేలా మూడు జతల చెప్పులు తయారుచేశాడు.

ఆనాటినుంచి అగ్నిశిఖుడు గంగలో దిగిన వెంటనే.. ఆయన తిరిగి వచ్చే తోవలో మాతంగుడు చెప్పులు పెట్టేవాడు. చుర్రుమనే ఎండకు కాళ్లు కాలుతున్నా అగ్నిశిఖుడు ఓర్చుకునేవాడు కానీ, ఎక్కడా నీడకోసం వేచి చూసేవాడు కాదు. పాదరక్షలు ధరించేవాడు కాదు.

మాతంగుడు కూడా నిరాశపడేవాడు కాదు. రోజూ గంగకు వచ్చి అగ్నిశిఖుని జపం పూర్తయ్యే వరకు వేచి చూసేవాడు. ఆయన వెళ్లిపోయిన తరువాత చెప్పులు తీసుకుని వెళ్లిపోయేవాడు.

కొన్నాళ్ల తరువాత ఒకరోజున.. వేడిగాడుపులు ఎక్కువగా ఉన్నాయి. సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. గంగ ఒడ్డున ఇసుక రేణువులు పెనంలో పెట్టినట్లు కాగిపోతున్నాయి. అగ్నిశిఖుడు అలవాటు చొప్పున పాదరక్షలు లేకుండానే ఇసుకలో నడవసాగాడు. ఎందుకో ఆరోజున ఆయన పాపం తట్టుకోలేకపోయాడు. పాదాలు బొబ్బలెక్కాయి.

కనీసం ఏదైనా ఆకుమీదనైనా కాలు పెట్టకపోతే అడుగు వేయడం కష్టమనిపించింది. అటువంటి స్థితిలో విధి ప్రేరితుడై మాతంగుడు ఉంచిన చెప్పుల్లో కాలుపెట్టాడు. అడుగులు కొద్దిగా చల్లబడగానే ఆ చెప్పులు విడిచి మఠానికి వెళ్లిపోయాడు.

కానీ, ఆ రాత్రి ఆయనకు నిద్రపట్టలేదు.

'అయ్యయ్యో! నేనొక తాపసిని కదా! తితీక్ష వహించకుండా ఇతరుల పాదరక్షలలో కాలుపెట్టాను. వారికి రుణపడ్డాను. ఛీఛీ శీతోష్ణ సహనం లేని నా తపస్సు ఇంకెందుకు? అయ్యయ్యో! దేహరక్షణ కోసం అధముడినై పోయాను!' అని చాలా బాధపడ్డాడు.

అగ్నిశిఖునికి ఇక ఆ బాధ చివరిరోజు వరకూ వదిలిపెట్టలేదు. ప్రాణం పోయే సమయంలో కూడా ఆయనకు ఆ పాదరక్షలే జ్ఞాపకం వచ్చాయి. ఆనాడు తనకు అంటిన కల్మషాన్నే మనసులో తలచుకుంటూ ప్రాణాలు విడిచిపెట్టాడు.

ఎంతటి యోగులకైనా ప్రారబ్ధాన్ని అనుభవించక తప్పదు. జన్మ తీసుకోకముందు, తీసుకున్న తరువాత కూడా.. ప్రారబ్ధ కర్మను బట్టే బుద్ధి మనిషిని ఆయా పనులకు ప్రేరేపిస్తూ ఉంటుంది.

అగ్నిశిఖుడు పరమపదించిన కొన్నాళ్లకే మాలిని నెల తప్పింది. గర్భచిహ్నాలు కనిపించగానే మాతంగుడు చింతామణి దగ్గరికి వెళ్లాడు. దండాలు పెట్టి, తన సంతోషాన్ని తెలియచేశాడు.

చింతామణి కొంతసేపు ధ్యానంలో కళ్లు మూసుకుని తలపంకిస్తూ..

''ఓరీ! నీకు మంచి కుమారుడు పుట్టగలడు. నీ భార్య నొప్పులు పడుతున్నప్పుడు నాతో చెప్పు. నేను వచ్చి చూస్తాను. ఇక వెళ్లు!'' అని పలికింది.

అటుపైన మఠానికి వెళ్లి విచారించగా.. అగ్నిశిఖుడు పరమపదించినట్లు తెలిసింది.

చింతామణి అప్పుడు పరితాపానికి గురైంది.

'ఆహా! క్రోధానికి లోనై ఎంత పాపం మూటగట్టుకున్నాను?! మోక్షసాధనలో ఉన్న యతికి మళ్లీ జన్మించాల్సిన అవసరం కల్పించాను. కామాన్ని జయించానని అనుకున్నాను కానీ, క్రోధమనే శత్రువు చేతిలో పడి పాపాత్మురాలిగా మిగిలిపోవాల్సి వచ్చింది కదా!' అనుకుని నెలలు లెక్కపెట్టుకుంటూ గడపసాగింది.

ఒకనాడు మాతంగుడు.. చింతామణి వాకిట నిలబడి..

''అమ్మగారూ! మా ఇంటిదానికి నొప్పులు వస్తున్నాయి!'' అని తెలియచేశాడు.

చింతామణి పరుగు పరుగున మాతంగుని గుడిసెకు వెళ్లింది. అప్పటికి మాలినికి ప్రసవమై గడియసేపైంది. మగశిశువు పుట్టాడు. కానీ, పిల్లవాడు పాలు తాగడం లేదు. దాంతో ఆ తల్లి దుఃఖపడుతున్నది. చింతామణి శిశువును ఎత్తుకుని, ఆకార లక్షణాలు పరిశీలించింది. అగ్నిశిఖుడే అలా పుట్టాడని తీర్మానించుకుంది.

ఆ శిశువుతో సంస్కృతంలో సంభాషించసాగింది.

''ఓ బాలుడా! నీవెవ్వరు?''.

''బాలికా! నేను యతిని''.

''ఇలా ఎందుకు జన్మించావు?''.

''నేను పూర్వజన్మలో ఒక వేసవికాలంలో గంగనుంచి మఠానికి పోతూ ఎండకు తాళలేక.. ఈ మాతంగుడు ఉంచిన పాదుకలలో కాళ్లు పెట్టాను. ఇతనికి రుణగ్రస్థుడినయ్యాను. ఆ విషయాన్నే తలుచుకుంటూ ప్రాణం వదలడం వల్ల వీనికి పుత్రుడినై పుట్టాను. ప్రాణం పోతున్న సమయంలో బుద్ధి ఎలా ఉంటుందో.. అటువంటి జన్మమే వస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి కదా!''.

''అయితే పాలు ఎందుకు తాగడం లేదు?! వీళ్లు అపవిత్రులని తలస్తున్నావా?''.

''లేదు. పాలు తాగితే వీళ్లకు మరింతగా రుణగ్రస్తుణ్ని కావాల్సి వస్తుంది. అందుకే మానేశాను'' అని చెప్పాడు బాలుడు.

ఆ మాటలు వింటున్న మాలినికి.. అంతసేపూ చింతామణి పిల్లాడితో ఏం మాట్లాడుతున్నదో తెలియదు. బాలుడు కూడా ఆమెతో మాట్లాడుతున్న సంగతి అసలే తెలియదు.

''తల్లీ! వీడు బతుకుతాడా? అయ్యో! నువ్వు కూడా కన్నీరు పెట్టుకుంటున్నావు ఏమిటమ్మా! నిజం చెప్పు'' అని బతిమాలింది.

చింతామణి ఆ పిల్లవాణ్ని తల్లి చేతికి ఇచ్చేసింది.

''వీనికేమీ భయం లేదు. కాకపోతే తల్లిపాలు పడవు. ఆవుపాలు కావాలి. నేను పోయి తీసుకుని వస్తాను'' అన్నది.

''తల్లీ! నువ్వు సెలవిస్తే నేనే వెళ్లి పాలు తీసుకొస్తాను'' అన్నాడు మాతంగుడు.

కానీ, అతను తెచ్చిన పాలను పిల్లవాడు తాగలేదు. చింతామణి తనింటికి పోయి పాలు తెచ్చింది. ఆ పాలను కూడా పిల్లవాడు ముట్టలేదు. చివరికి ఒక బ్రాహ్మణుడి ఇంటినుంచి ఆవుపాలు తీసుకురాగా.. వాటిని తాగాడు.

ఆ మరునాడు కూడా అదే ఆవుపాలు తీసుకొస్తే తాగలేదు. ఆరోజు నుంచి చింతామణి తానే రోజుకొక బ్రాహ్మణుని ఇంటినుంచి ఆవుపాలు యాచించి తెచ్చి, పిల్లవానికి పట్టించేది. పిల్లవాడు దినదినాభివృద్ధి పొందుతూ పెరుగుతున్నాడు. నవ్వడం, దొర్లడం, కూర్చోవడం, పాకడం నేర్చుకున్నాడు. పిల్లవానికి అన్నప్రాశన చేసే నిమిత్తం చింతామణి ఎక్కణ్నుంచో పాయసాన్ని తీసుకువచ్చింది. కానీ పిల్లవాడు దానిని తినలేదు. దాంతో పళ్లు పెట్టడం అలవాటు చేసింది. పిల్లవాడు పళ్లు, పాలు తప్ప మరేదీ తీసుకునేవాడు కాదు.

మాతంగుడు ఆ పిల్లవానికి 'చింతామణి' అనే పేరు పెట్టుకున్నాడు. పిల్లవాడు బుడిబుడి నడకలు వేస్తుండగా ఒకనాడు చింతామణి ఇలా చెప్పింది.

''మాతంగా! ఒక్క విషయం గుర్తుపెట్టుకో! ఎన్నడూ నీ కుమారుడి నుంచి ఏదీ స్వీకరించవద్దు. ధనరూపంగా, వస్తురూపంగా అతను ఏమిచ్చినా పుచ్చుకోవద్దు. నువ్వు ఏనాడూ అతని సంపాదనను ఆశించకు. ఈ నియమం పాటించినంత కాలం మాత్రమే అతను నీతో ఉంటాడు. తరువాత నీ ఇష్టం!''.

''అలాగే తల్లీ! ఈ విషయం నా భార్యకు కూడా చెబుతాను. జాగ్రత్త పడతాం'' అన్నాడు మాతంగుడు.

మాతంగుడు, మాలిని తమ కొడుకును ఎప్పుడూ గుడిసె దాటి బయటికి పోనిచ్చేవారు కాదు. అతను కూడా ఆటపాటల ధ్యాస కూడా లేకుండా ఎప్పుడూ ఏదో ధ్యానంలో గడుపుతుండేవాడు.

కాలక్రమంలో మాతంగుని కొడుకైన చింతామణికి ఏడేళ్ల వయసు వచ్చింది.

మాతంగునికి ప్రయాగలో నెలకొక రాత్రి గస్తీ తిరగాల్సిన వంతు ఉండేది. అలా గస్తీ తిరిగినందుకు గానూ రాజభవనం నుంచి కొంత మాన్యం ఆ కుటుంబానికి ప్రతినెలా ముడుతుంది. ఎప్పుడైనా వంతునాడు గస్తీ తిరగకపోతే వానికిచ్చిన మాన్యం ఉపసంహరిస్తారు. అందుకే మాతంగుడు ఎప్పుడూ తన వంతు మానేవాడు కాదు.

ఒకసారి తప్పనిసరి పని పడి మాతంగుడు తన వంతునాడు వేరే ఊరికి వెళ్లాడు. గస్తీ సమయానికి తిరిగి రావాలని ప్రయత్నిస్తుంటే.. దారిలో గంగ పొంగింది. రేవు దాటించే నావ దొరకలేదు. మాన్యం పోతుందని బాధపడుతూ అతను అవతలి ఒడ్డునే ఉండిపోయాడు. ■

**(వచ్చేవారం.. తస్మాత్ జాగృత జాగృత)**